మన రాజధాని
రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
శనివారం 24 అక్టోబర్ 2026 పేజీలు : 4

పోటీకి విముఖత.. చివరకు నామినేషన్!

అధిష్ఠానం ఆదేశాలతో బరిలోకి డాక్టర్ సత్యసరోజ

నకరికల్లు జడ్పీటీసీ నుంచి పల్నాడు జడ్పీ పీఠం వరకు.. రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ

రిజర్వేషన్లు రాజకీయ ఆశావహుల అంచనాలను తలకిందులు చేస్తే.. అధిష్ఠానం ఆదేశాలు మరో కొత్త పేరును తెరపైకి తెచ్చాయి. పోటీకి దూరంగా ఉండాలనుకున్న కుటుంబం చివరకు ఎన్నికల బరిలోకి దిగాల్సి వచ్చింది. పల్నాడు జిల్లా పరిషత్ ఛైర్మన్ పీఠం చుట్టూ సాగుతున్న సమీకరణాల్లో భాగంగా డాక్టర్ నాగోతు వెంకట సత్యసరోజ నకరికల్లు జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ వేయడం ఆసక్తికర మలుపు. కుటుంబ సభ్యుల విముఖత నుంచి పార్టీ పెద్దల ఒత్తిడి వరకు సాగిన పరిణామాలు.. ఇప్పుడు ఆమెను జడ్పీ పీఠం రేసులో నిలిపాయన్న చర్చ జిల్లా రాజకీయాల్లో వేడెక్కుతోంది.

శిలార్ । నరసరావుపేట -- రక్షణ ప్రతినిధి

5లో.

కిందపడిన మాజీ మంత్రి రజనీ!

పోలీసులతో వాగ్వాదం.. తోపులాటలో ఘటన

నామినేషన్ వేయనున్న అభ్యర్థిని అడ్డుకోవడంతో వివాదం

వివరాలు 2లో..

ఎన్నికల వేళ ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన నామినేషన్ల ఘట్టం వివా దాలకు వేదికవుతోంది. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు స్వేచ్ఛగా ముందుకు వెళ్లగలుగుతున్నారా? భద్రత కల్పించాల్సిన యంత్రాంగం వ్యవహా రశైలి ఎలా ఉంది? చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడదల రజనీ కిందపడిన ఘటన ఈ ప్రశ్నలను మరోసారి తెరపైకి తెచ్చింది.

నరసరావుపేట: రక్షణ ప్రతినిధి

అదృష్టం కలిసొచ్చేనా..

నాలుగు రోజుల్లోనే రాజకీయాల్లో 'శివ' సంచలనం!

కారంపూడి జడ్పీటీసీగా ఏకగ్రీవం.. పల్నాడు జడ్పీ పీఠంపై కన్ను?

2లో.

రిజర్వేషన్ల చక్రం తిరిగింది.. రాజకీయ రంగంలో కొత్త పేరు తెరపైకి వచ్చింది! కారంపూడి ఎంపీపీ కావాలన్న ఆలోచనకు రిజర్వేషన్లు అడ్డుపడితే.. జడ్పీటీసీ అవకాశం మరో దారిని చూపింది. అంతే.. కొండపల్లి శివకుమారి రాజకీయ ప్రయాణం అనూహ్య వేగం అందుకుంది. నిన్నటివరకు విద్యారంగానికే పరిమితమైన ఆమె పేరు.. నేడు పల్నాడు జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. నామినేషన్ దాఖలు.. పోటీ లేకుండా ఏకగ్రీవ ఎన్నిక దిశగా అడుగులు.. ఇప్పుడు అందరి చూపూ జడ్పీ ఛైర్మన్ పీఠంపైనే! కుటుంబ వ్యూహమా? రాజకీయ అవకాశాన్ని అందిపుచ్చుకున్న చాకచక్యమా? తెరవెనుక సంప్రదింపులు ఎంతవరకు ఫలిస్తాయి? జడ్పీటీసీగా తొలి మెట్టు ఎక్కిన 'శివ'.. జిల్లా పరిషత్ పీఠం వరకు చేరుతారా? పల్నాడు రాజకీయాల్లో ఇదే ఇప్పుడు అసలు ఆసక్తి!

శిలార్ । నరసరావుపేట -- రక్షణ ప్రతినిధి

నామినేషన్ల వేళ బాపట్ల లో జోష్!

భారీ ర్యాలీతో బాపట్లకు తరలివచ్చిన శ్రేణులు

అభ్యర్థుల వెంట ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు.. విజయంపై ధీమా

బాపట్ల జిల్లాలో జడ్పీటీసీ నామినేషన్ల వేళ కూటమి శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేసింది. పిట్టలవానిపాలెం, కర్లపాలెం మండలాల అభ్యర్థుల నామినేషన్లకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు స్వయంగా హాజరయ్యారు. చందోలు నుంచి భారీ ర్యాలీగా తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల సందడి నెలకొంది. రెండు స్థానాల్లోనూ విజయం సాధిస్తామన్న ధీమాను ఎమ్మెల్యే వ్యక్తం చేశారు.

బాపట్ల: రక్షణ న్యూస్

వివరాలు 2లో..

నామినేషన్లకు అడ్డంకులు సృష్టిస్తే కఠిన చర్యలు

అభ్యర్థులకు పోలీసు రక్షణ.. పల్నాడు కలెక్టర్ కృతిక శుక్ల, ఎస్పీ జగదీశ్ స్పష్టం

పల్నాడు జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోందని కలెక్టర్ కృతిక శుక్ల తెలిపారు. ఇప్పటివరకు జడ్పీటీసీకి 65, ఎంపీటీసీకి 768 నామినేషన్లు దాఖలయ్యాయని వెల్లడించారు. అభ్యర్థులను అడ్డుకున్నా, బెదిరించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీశ్ హెచ్చరించారు. అవసరమైన వారికి పోలీసు రక్షణ, ఎస్కార్ట్ కల్పిస్తామని స్పష్టం చేశారు.

నరసరావుపేట, రక్షణ న్యూస్

5లో.

ఫ్రాన్స్ నుంచి పల్నాడు రాజకీయాల్లోకి!

పెదకూరపాడు జడ్పీటీసీగా కీర్తన ఏకగ్రీవం.. జడ్పీ పీఠంపై గురి?

రాజకీయ వారసత్వానికి యువతరం జోడింపు.. అధికారిక ప్రకటన లాంఛనమే

విదేశీ విద్య.. రాజకీయ వారసత్వం.. ప్రజా జీవితంలోకి అడుగు! పల్నాడు జిల్లా పరిషత్ పీఠంపై యువ నాయకత్వం వైపు తెలుగుదేశం పార్టీ చూపు పడుతోందా? ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించిన నల్లపాటి కీర్తన రాజకీయాల్లోకి అనూహ్యంగా ప్రవేశించి, పెదకూరపాడు జడ్పీటీసీగా ఏకగ్రీవ ఎన్నిక దిశగా సాగడం ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు తెరలేపింది. నామినేషన్ నుంచి ఏకగ్రీవం వరకు సాగిన ఆమె ప్రయాణం కంటే.. తదుపరి లక్ష్యం ఏమిటన్నదే రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. జడ్పీ చైర్‌పర్సన్ రేసులో ఆమె పేరు వినిపిస్తుండటంతో కీర్తన రాజకీయ ప్రస్థానం ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

నరసరావుపేట, రక్షణ ప్రతినిధి:

వివరాలు 2లో..

16- 9- 26 rakshana_praja jyothi Medhak.qxd 10/23/2026 11:00 PM Page 2

కిందపడిన మాజీ మంత్రి రజనీ!

మొదటి పేజీ తరువాయి నరసరావుపేట: రక్షణ ప్రతినిధి

మాజీ మంత్రి నివాసం వద్దే ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. చిలకలూరిపేటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజనీకి పోలీసులతో ఎదురైన వాగ్వాదం, తోపులాట చివరకు ఆమె కిందపడే వరకు వెళ్లింది. యడ్లపాడు జడ్పీటీసీ అభ్యర్థి పందుల బుల్లబ్బాయిని నివాసంలోకి అనుమతించే విషయంలో వివాదం తలెత్తినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు బయటకు రావడంతో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల వేళ అభ్యర్థుల భద్రత, పోలీసుల వ్యవహారశైలిపై చర్చ మొదలైంది. చిలకలూరిపేటలోని విడదల రజనీ నివాసానికి యడ్లపాడు జడ్పీటీసీ అభ్యర్థి పందుల బుల్లబ్బాయి వెళ్లిన సమయంలో పోలీసులు ఆయనను ఇంటి గేటు వద్దే అడ్డుకున్నట్లు సమాచారం. దీంతో తనను కలవడానికి వచ్చిన వ్యక్తిని ఎందుకు అడ్డుకుంటున్నారని రజనీ ప్రశ్నించారు. తన నివాసంలోకి వచ్చిన వారిని లోపలికి అనుమతించాలని కోరుతూ ఆమె ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఈ క్రమంలో చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ ప్రియాంకకు, రజనీకి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది.

తోపులాటలో కిందపడిన రజనీ

ఇరువురి మధ్య చోటుచేసుకున్న తోపులాటలో విడదల రజనీ కిందపడినట్లు ఘటనకు సంబంధించిన దృశ్యాలు సూచిస్తున్నాయి. ఈ పరిణామం అక్కడున్నవారిలో ఆందోళనకు కారణమైంది. మాజీ మంత్రి తన నివాసం వద్దే పోలీసులతో ఈ పరిస్థితిని ఎదుర్కోవాల్సి రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఘటనకు సంబంధించిన వీడియోలో కనిపించే దృశ్యాల ఆధారంగా అసలు ఏం జరిగిందనే అంశంపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. పోలీసులు, రజనీ వర్గం నుంచి అధికారిక వివరణ వెలువడితే ఘటనకు దారితీసిన పరిస్థితులపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

అభ్యర్థుల భద్రతపై ప్రశ్నలు

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకుంటున్నారంటూ ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసేందుకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజా ఘటన ఎన్నికల నిర్వహణలో పోలీసుల పాత్రపై చర్చకు దారితీసింది. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ప్రతి అభ్యర్థికి నిబంధనల ప్రకారం నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పించడం, శాంతిభద్రతలను పరిరక్షించడం అధికారుల బాధ్యత. ఏ అభ్యర్థి అయినా భయం, ఒత్తిడి లేకుండా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే పరిస్థితులు ఉండాలి. చిలకలూరిపేట ఘటనపై పోలీసు శాఖ స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఘటనకు సంబంధించిన వీడియోలోని పూర్తి దృశ్యాలను పరిశీలించి, ఇరువర్గాల వాదనలు తెలుసుకున్న తర్వాతే బాధ్యత ఎవరిదనే అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

అదృష్టం కలిసొచ్చేనా.

శిలార్ । నరసరావుపేట -- రక్షణ ప్రతినిధి

పల్నాడు జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు వినిపిస్తున్న పేరు డాక్టర్ కొండపల్లి శివకుమారి. రాజకీయాలకు దూరంగా ఉన్న ఆమె.. అనూహ్యంగా ఎన్నికల బరిలోకి వచ్చి నాలుగు రోజుల్లోనే జడ్పీటీసీ స్థాయికి చేరడం ఆసక్తికరంగా మారింది. మాచర్ల నియోజకవర్గంలోని కారంపూడి జడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన ఆమెకు పోటీ లేకపోవడంతో ఏకగ్రీవ ఎన్నికకు మార్గం సుగమమైంది. అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇప్పుడు ఆమె దృష్టి పల్నాడు జిల్లా పరిషత్ ఛైర్మన్ పీఠంపై ఉందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. అనూహ్యంగా మొదలైన ఈ రాజకీయ ప్రయాణం ఎక్కడికి చేరుతుందన్నది ఆసక్తికరంగా మారింది. డాక్టర్ కొండపల్లి శివకుమారి ఉన్నత విద్యావంతురాలు. ఇంజినీరింగ్ విద్యను అభ్యసించడంతోపాటు పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పొందారు. విద్యాసంస్థ నిర్వహణలోనూ ఆమెకు అనుభవం ఉంది. భర్త డాక్టర్ కొండపల్లి నాగేశ్వరరావు. వీరి స్వస్థలం కారంపూడి మండలం ఒప్పిచర్ల. కొండపల్లి కుటుంబంలో పలువురు విద్యావంతులుండటం, సామాజికంగా, ఆర్థికంగా ఆ కుటుంబానికి ఉన్న స్థానం రాజకీయ ప్రవేశానికి అనుకూల వాతావరణాన్ని కల్పించినట్లు స్థానిక వర్గాల్లో చర్చ సాగుతోంది. కొండపల్లి కుటుంబానికి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో సన్నిహిత సంబంధాలున్నట్లు సమాచారం. కుటుంబంలో పెద్దవారైన అమరలింగయ్యకు ఎమ్మెల్యేతో సాన్నిహిత్యం ఉంది. తొలుత కారంపూడి ఎంపీపీ పదవిని ఆశించిన కుటుంబానికి రిజర్వేషన్లు అనుకూలించలేదు. ఆ పదవి బీసీ జనరల్‌కు కేటాయించడంతో వారి ప్రయత్నాలకు విరామం ఏర్పడింది. అయితే కారంపూడి జడ్పీటీసీ స్థానం ఓసీ మహిళకు, పల్నాడు జిల్లా పరిషత్ ఛైర్మన్ పీఠం కూడా ఓసీ మహిళకు కేటాయించడంతో పరిస్థితులు ఒక్కసారిగా మారాయి. ఈ పరిణామాన్ని అవకాశంగా భావించిన కుటుంబ సభ్యులు శివకుమారిని జడ్పీటీసీ అభ్యర్థిగా నిలబెట్టి, తదుపరి జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి ప్రయత్నించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. కుటుంబంలో జరిగిన చర్చలు, రాజకీయ సంప్రదింపులు వేగంగా సాగడంతో కొద్ది వ్యవధిలోనే ఆమె రాజకీయ ప్రవేశానికి రంగం సిద్ధమైంది. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని కలిసి తన అభిప్రాయాన్ని వెల్లడించగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. అనంతరం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును కలిసి తన రాజకీయ ప్రయత్నాల గురించి వివరించారు. ఆయన శుభాకాంక్షలు తెలిపినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కారంపూడి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సమాచారం చేరడంతో అభ్యర్థిత్వానికి మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. గురువారం జూలకంటి గౌతమ్‌రెడ్డి ఆధ్వర్యంలో బంధుమిత్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శివకుమారి నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల గడువు ముగిసే సమయానికి ఆమెకు ప్రత్యర్థిగా ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో ఏకగ్రీవ ఎన్నికకు మార్గం ఏర్పడింది. వైసీపీ నేతలు పోటీ అభ్యర్థిని నిలబెట్టేందుకు ప్రయత్నించినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరిగినప్పటికీ, చివరకు పోటీ లేకుండానే పరిస్థితి ముగిసింది. జడ్పీటీసీగా ఏకగ్రీవ ఎన్నిక దిశగా తొలి అడుగు పడటంతో శివకుమారి తదుపరి లక్ష్యంపై చర్చ మొదలైంది. జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీల మద్దతు కూడగట్టేందుకు ఆమె ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితర ముఖ్య నేతలను కలిసి తన అభ్యర్థిత్వానికి మద్దతు కోరే ఆలోచనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అయితే జడ్పీటీసీగా ఏకగ్రీవ ఎన్నిక కావడం ఒక దశ మాత్రమే. జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎంపికలో పార్టీ నిర్ణయం, సభ్యుల మద్దతు, రాజకీయ సమీకరణాలు కీలకంగా మారనున్నాయి. విద్యారంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన శివకుమారి తన లక్ష్యాన్ని చేరుకుంటారా? అనూహ్యంగా ప్రారంభమైన ఆమె రాజకీయ ప్రస్థానం జిల్లా పరిషత్ పీఠం వరకు చేరుతుందా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. పల్నాడు రాజకీయాల్లో 'శివ' తదుపరి అడుగు ఇప్పుడు ఆసక్తికర చర్చగా మారింది.

నామినేషన్ల వేళ బాపట్ల లో జోష్!

మొదటి పేజీ తరువాయి బాపట్ల: రక్షణ న్యూస్

నామినేషన్ల పర్వంలో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేసింది. పిట్టలవానిపాలెం, కర్లపాలెం జడ్పీటీసీ స్థానాలకు కూటమి బలపరిచిన అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమాలు సందడిగా సాగాయి. చందోలు నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు స్వయంగా పాల్గొని నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. నినాదాలు, కార్యకర్తల సందడితో ర్యాలీ ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కించింది .పిట్టలవానిపాలెం మండల జడ్పీటీసీ స్థానానికి మహ్మద్ మొహిబుర్ రెహ్మాన్ (అఫ్జల్), కర్లపాలెం మండల జడ్పీటీసీ స్థానానికి నక్కల లక్ష్మీ వెంకటస్వామి కూటమి బలపరిచిన అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. చందోలు నుంచి బయలుదేరిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొనడం కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని మరింత పెంచింది. వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో కార్యక్రమం సందడిగా సాగింది. ర్యాలీ అనంతరం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే, అభ్యర్థుల నామినేషన్ దాఖలు ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించే సమయంలో వారికి అండగా నిలిచారు. ఎన్నికల బరిలో అభ్యర్థుల తరఫున నాయకత్వం సమన్వయంతో ముందుకు సాగుతున్న సంకేతంగా ఈ కార్యక్రమం నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ పిట్టలవానిపాలెం, కర్లపాలెం మండలాల్లో కూటమి అభ్యర్థుల విజయంపై ధీమా వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నామినేషన్ల దశలోనే భారీగా శ్రేణులు తరలిరావడం కూటమి శిబిరంలో ఉత్సాహాన్ని నింపింది. ఇక ప్రచారంలో ఈ ఐక్యతను ఎంతవరకు కొనసాగిస్తారు? ఓటర్ల మద్దతును తమవైపు తిప్పుకునేందుకు ఎలాంటి వ్యూహాలతో ముందుకు వెళ్తారు? అన్నది రానున్న రోజుల్లో ఆసక్తికరంగా మారనుంది.

ఫ్రాన్స్ నుంచి పల్నాడు రాజకీయాల్లోకి!

మొదటి పేజీ తరువాయి నరసరావుపేట, రక్షణ ప్రతినిధి:

విదేశాల్లో ఉన్నత విద్య.. రాజకీయాల్లోకి అడుగుపెట్టాలన్న ఆసక్తి.. అనూహ్యంగా ఎదురైన స్థానిక ఎన్నికల అవకాశం! ఈ మూడింటి కలయికతో నల్లపాటి కీర్తన రాజకీయ ప్రస్థానం పల్నాడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించి వచ్చిన ఆమె, తండ్రి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ ప్రోత్సాహంతో తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికల బరిలోకి దిగారు. పెదకూరపాడు జడ్పీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన ఆమెకు పోటీ లేకపోవడంతో ఏకగ్రీవ ఎన్నికకు మార్గం ఏర్పడింది. అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇప్పుడు ఆమె పేరు జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి పోటీ పడుతున్న ఆశావహుల జాబితాలోనూ వినిపిస్తుండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. నల్లపాటి కీర్తన రాజకీయ ప్రవేశం వెనుక కుటుంబ నేపథ్యం కూడా ప్రత్యేకంగా ప్రస్తావనకు వస్తోంది. నరసరావుపేటకు చెందిన ప్రముఖ టీడీపీ నాయకుడు నల్లపాటి రామచంద్ర ప్రసాద్ కుమార్తె అయిన ఆమె, కుటుంబానికి ఉన్న రాజకీయ పరిచయాలు, వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలన్న ఆలోచనతో ప్రజాజీవితంలోకి అడుగుపెట్టినట్లు కుటుంబ సన్నిహితులు చెబుతున్నారు. నరసరావుపేట జడ్పీటీసీ స్థానం రిజర్వేషన్ కారణంగా ఆమెకు అనుకూలంగా లేకపోవడంతో పెదకూరపాడు నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. కీర్తన కుటుంబానికి రాజకీయాల్లో సుదీర్ఘ నేపథ్యం ఉంది. ఆంధ్ర రాష్ట్ర తొలి శాసనసభ స్పీకర్‌గా పనిచేసిన నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి, ఎమ్మెల్సీగా సేవలందించిన నల్లపాటి వెంకటేశ్వర్లు చౌదరి ఆమె ముత్తాతలు. ఆమె తాత నల్లపాటి చంద్రశేఖరరావు జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా పనిచేశారు. ఈ రాజకీయ వారసత్వం కుటుంబంలో ప్రజాసేవ, రాజకీయాలపై ఆసక్తిని పెంచిందని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. విదేశాల్లో చదువుకుని వచ్చిన యువతి స్థానిక సంస్థల ఎన్నికల్లో నేరుగా జడ్పీటీసీ స్థానానికి పోటీ చేయడం, ఆ వెంటనే జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవిపైనా ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం సాగడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. చిన్న వయసులోనే రాజకీయ రంగంలోకి అడుగుపెట్టిన కీర్తన భవిష్యత్ ప్రయాణంపై టీడీపీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. అయితే జడ్పీటీసీగా ఏకగ్రీవ ఎన్నిక కావడం ఒక దశ మాత్రమే. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి పార్టీ మద్దతు, సభ్యుల బలం, అధిష్ఠానం నిర్ణయం కీలకంగా మారనున్నాయి. యువతరానికి నాయకత్వ అవకాశాలు కల్పించాలన్న చర్చ నేపథ్యంలో కీర్తనకు ఎలాంటి రాజకీయ బాధ్యతలు దక్కుతాయన్నది ఆసక్తికరంగా మారింది. విదేశీ విద్యతో వచ్చిన అనుభవాన్ని ప్రజాజీవితంలో ఎలా ఉపయోగించుకుంటారు? కుటుంబ రాజకీయ వారసత్వాన్ని తనదైన శైలిలో ముందుకు తీసుకెళ్తారా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

16- 9- 26 rakshana_praja jyothi Medhak.qxd 10/23/2026 11:00 PM Page 3

ఎన్నికల వేళ భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు

వైసీపీ అభ్యర్థులకు రక్షణ కల్పించండి

కలెక్టర్‌కు ఫోన్‌లో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి

నరసరావుపేట, రక్షణ

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసేందుకు తగిన రక్షణ కల్పించాలని ఆ పార్టీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. నిరాహార దీక్ష శిబిరం నుంచి కలెక్టర్‌కు ఫోన్ చేసి అభ్యర్థుల భద్రతపై విజ్ఞప్తి చేశారు.ముందుగా ఇద్దరు జడ్పీటీసీ అభ్యర్థులతో నామినేషన్లు దాఖలు చేయించాలని కలెక్టర్‌ను కోరిన గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మిగిలిన అభ్యర్థులు కూడా స్వేచ్ఛగా నామినేషన్లు వేసేందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థికి నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పించాలని కోరారు.దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో మాట్లాడి అభ్యర్థులకు రక్షణ కల్పించేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో పల్నాడు జిల్లాలో రాజకీయంగా ఉద్రిక్తతలు చోటుచేసుకున్నట్లు వివిధ వార్తా కథనాలు వెల్లడించిన నేపథ్యంలో, అభ్యర్థుల భద్రత అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు ఉద్యోగులపై చర్యలు

విధుల నుంచి తొలగించాలని కలెక్టర్‌కు లేఖలు

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: నగర కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు, రక్షణ

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న ఇద్దరు ఆప్కాస్ ఉద్యోగులపై చర్యలకు గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు ఉపక్రమించారు. జీఎంసీలో పనిచేస్తున్న మందా కిషోర్‌బాబు, షేక్ గౌస్‌పీరాలను ఉద్యోగాల నుంచి తొలగించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టర్, ఆప్కాస్ మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖలు పంపినట్లు నగర కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కే. మయూర్ అశోక్ తెలిపారు.జీఎంసీ మలేరియా విభాగంలో ఆప్కాస్ వర్కర్‌గా పనిచేస్తున్న మందా కిషోర్‌బాబు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు అధికారులు గుర్తించారు. అదేవిధంగా జీఎంసీలో ఆప్కాస్ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న షేక్ గౌస్‌పీర్ కూడా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో ఉద్యోగులు రాజకీయ ప్రచారంలో పాల్గొనడాన్ని నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తూ చర్యలకు సిఫారసు చేసినట్లు కమిషనర్ వెల్లడించారు.ఎన్నికల విధులకు సంబంధించి అమలులో ఉన్న నిబంధనలను ఉద్యోగులందరూ తప్పనిసరిగా పాటించాలని మయూర్ అశోక్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడం, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడితే ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా సాగేందుకు ప్రభుత్వ, స్థానిక సంస్థల ఉద్యోగులు నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఉద్యోగులపై తదుపరి చర్యలు సంబంధిత అధికారుల నిర్ణయానికి లోబడి ఉంటాయని తెలిపారు

నామినేషన్ల ప్రక్రియపై కలెక్టర్ పరిశీలన..

ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్‌లు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి సీఎండీ ఆదేశాలు

బాపట్ల, రక్షణ

: స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు, అభ్యర్థులకు అవసరమైన భద్రత కల్పించేందుకు బాపట్ల జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఎన్నికల ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా కలెక్టరేట్‌తోపాటు బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. మరోవైపు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. అమృతలూరు మండలంలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించడంతోపాటు ఎలవర్రు, ప్యాపర్రు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వసతులను తనిఖీ చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ల ద్వారా ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రజలు సమాచారం అందించవచ్చని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల సమయంలో ఎవరికైనా ఇబ్బందులు ఎదురైనా, భద్రత అవసరమైనా సంబంధిత నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. ఫిర్యాదులపై స్పందించి అవసరమైన భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. శుక్రవారం అమృతలూరు మండల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జరుగుతున్న ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఎలవర్రు, ప్యాపర్రు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న వసతులను సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఫిర్యాదులకు సంప్రదించాల్సిన నంబర్లు

జిల్లా కంట్రోల్ రూమ్: 08643-220226
వాట్సాప్ నంబర్: 8712417880
రేపల్లె డివిజన్ హెల్ప్‌లైన్: 9440780426
రేపల్లె ల్యాండ్‌లైన్: 08648-293795
చీరాల ఆర్డీవో కార్యాలయం: 87126 55910

బాపట్ల ఆర్డీవో కార్యాలయం: 9493803524

ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు తమ ఫిర్యాదులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు.

విద్యుత్ సరఫరాపై సీఎండీ సమీక్ష

మరోవైపు, ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి. పుల్లారెడ్డి బాపట్ల సర్కిల్ విద్యుత్ శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. స్థానిక సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన, ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద సబ్‌స్టేషన్ల నిర్మాణం, జీఐఎస్ మ్యాపింగ్, వినియోగదారుల సేవలు, ఆదాయ వసూళ్లు, విద్యుత్ నష్టాల నియంత్రణపై డివిజన్ల వారీగా సమీక్షించారు.అర్హులైన రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడంలో జాప్యం లేకుండా చూడాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకంపై గృహ వినియోగదారులకు అవగాహన కల్పించాలని, ఆర్‌డీఎస్ఎస్ పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని స్పష్టం చేశారు. సిబ్బంది విద్యుత్ భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.సమావేశంలో డైరెక్టర్ టెక్నికల్ ఆవుల మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ఫైనాన్స్ ఎస్. వెంకటేశ్వర్లు, బాపట్ల సర్కిల్ సూపరింటెండెంట్ జి. ఆంజనేయులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మీ ఓటు ఎక్కడుందో తెలుసుకోండి!

రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో వివరాలు పరిశీలించుకోండి

గుంటూరు, రక్షణ

: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో ముందుగానే తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.ఎం. సాయికాంత్ వర్మ సూచించారు. ఓటరు జాబితాలో తమ పేరు, ఇతర వివరాలు, పోలింగ్ కేంద్రం సమాచారాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ ద్వారా పరిశీలించుకోవాలని కోరారు.ఎన్నికల రోజున ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఓటర్లు ముందస్తుగా వివరాలను తనిఖీ చేసుకోవడం అవసరమని పేర్కొన్నారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రం వివరాలు తెలుసుకోవడంతోపాటు ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు.ఓటరు వివరాలను పరిశీలించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను అందుబాటులో ఉంచింది.

ఓటరు వివరాల కోసం వెబ్‌సైట్:https://sec-ems.ap.gov.in/apsec/voterPortal ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటు హక్కు కీలకమని, ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎన్నికలకు ముందే తమ వివరాలను పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు.

అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పోలీసుల తనిఖీలు

బాపట్ల రక్షణ న్యూస్

శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు బాపట్ల రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం రాత్రి రిసార్టులు, హోటళ్లు, ధాబాల్లో తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, బాపట్ల డీఎస్పీ చంద్రమౌళి పర్యవేక్షణలో రూరల్ సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు.రూరల్ ఎస్సై అలేఖ్య పోలీసు సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. రిసార్టులు, హోటళ్లు, ధాబాల నిర్వాహకులు నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు నిర్వహించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు.

పల్నాడులో టీడీపీ జోరు!

ఎంపీటీసీకి 1,315.. జడ్పీటీసీకి 141 నామినేషన్లు

ఎంపీటీసీలో టీడీపీ నుంచి 878.. వైసీపీ 222, జనసేన 91

నరసరావుపేట, రక్షణ ప్రతినిధి:

పల్నాడు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసింది. మూడు రోజుల పాటు సాగిన నామినేషన్ల ప్రక్రియలో ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 1,315 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో తెలుగుదేశం పార్టీ అత్యధికంగా 878 నామినేషన్లతో ముందంజలో నిలిచింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 222, జనసేన నుంచి 91 నామినేషన్లు నమోదయ్యాయి. జడ్పీటీసీ స్థానాలకు 141 నామినేషన్లు దాఖలు కావడంతో జిల్లాలో గ్రామీణ రాజకీయాలు వేడెక్కాయి.అక్టోబరు 21 నుంచి 23వ తేదీ వరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ కొనసాగింది. ఎంపీటీసీ స్థానాలకు ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. పార్టీలు, అభ్యర్థుల వారీగా వచ్చిన నామినేషన్లతో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల సందడి నెలకొంది.ఎంపీటీసీ నామినేషన్లలో తెలుగుదేశం పార్టీ నుంచి 878, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 222, జనసేన నుంచి 91, కాంగ్రెస్ నుంచి 34 నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులుగా 67 మంది నామినేషన్లు సమర్పించారు. సీపీఐ(ఎం) నుంచి తొమ్మిది, బీజేపీ నుంచి ఏడు, ఇతర పార్టీల నుంచి నాలుగు, బీఎస్పీ నుంచి మూడు నామినేషన్లు నమోదయ్యాయి. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. జిల్లాలోని 419 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ఈ నామినేషన్లు నమోదయ్యాయి.

జడ్పీటీసీ స్థానాలకూ భారీగా నామినేషన్లు

జిల్లాలో జడ్పీటీసీ స్థానాలకు మొత్తం 141 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో టీడీపీ నుంచి 85, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 20, జనసేన నుంచి ఐదు నామినేషన్లు వచ్చాయి. ఇతరుల విభాగంలో 31 నామినేషన్లు నమోదయ్యాయి. జడ్పీటీసీ స్థానాల్లోనూ ప్రధాన పార్టీల మధ్య పోటీ ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. నామినేషన్ల దాఖలు ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియపై పడింది. అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హులైన అభ్యర్థుల వివరాలు వెల్లడికానున్నాయి. ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాతే ఆయా స్థానాల్లో తుది పోటీదారుల సంఖ్యపై స్పష్టత రానుంది.మొత్తంగా నామినేషన్ల లెక్కలు జిల్లాలో ఎన్నికల పోటీకి సంబంధించిన ప్రాథమిక చిత్రాన్ని చూపుతున్నాయి. అయితే నామినేషన్ల సంఖ్య ఒక్కటే ఎన్నికల ఫలితాలను సూచించదు. తుది అభ్యర్థుల జాబితా వెలువడిన తర్వాత స్థానిక పరిస్థితులు, అభ్యర్థుల బలం, పార్టీల ప్రచార వ్యూహాలు గ్రామీణ ఎన్నికల సమీకరణాలను ప్రభావితం చేయనున్నాయి.

నామినేషన్లకు ఆటంకాలుంటే పోలీసులకు చెప్పండి

సాయంత్రం 5 గంటల వరకు గడువు.. అభ్యర్థులకు భద్రత కల్పిస్తాం

కలెక్టర్ సాయికాంత్ వర్మ ప్రకటన

గుంటూరు, రక్షణ

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు శుక్రవారం సాయంత్రం 5 గంటలలోపు నామినేషన్లు దాఖలు చేయవచ్చని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.ఎం. సాయికాంత్ వర్మ తెలిపారు. నామినేషన్ల దాఖలులో ఎక్కడైనా ఆటంకాలు, సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి లేదా పోలీసు సూపరింటెండెంట్ దృష్టికి తీసుకురావాలని సూచించారు .ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ స్వేచ్ఛగా, ప్రశాంతంగా సాగేందుకు పోలీసు శాఖ సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. ఎవరైనా అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నా, ఇతర కారణాలతో నామినేషన్ వేయడంలో ఇబ్బందులు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు .సమస్యలపై సకాలంలో సమాచారం అందితే, గడువులోగా నామినేషన్ దాఖలు చేసేందుకు సంబంధిత అభ్యర్థులకు అవసరమైన పోలీసు సహకారం అందిస్తారని తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులకు పోలీసు శాఖ తరఫున సూచనలు చేసినట్లు పేర్కొన్నారు.

సంప్రదించాల్సిన నంబర్లు

- గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయం: 8688831390
- అత్యవసర పోలీసు సహాయం: 112
- సమీప పోలీసు స్టేషన్‌ను నేరుగా సంప్రదించవచ్చు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు నామినేషన్లకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే ఆలస్యం చేయకుండా పోలీసులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా సాగేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారని, అభ్యర్థులు భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఎన్నికల సామగ్రి పంపిణీలో ఎక్కడా లోపాలు ఉండకూడదు

బాపట్ల రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల సామగ్రి పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని, ప్రతి పోలింగ్ కేంద్రానికి నిర్దేశించిన మేరకు సామగ్రిని పూర్తిస్థాయిలో అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నోడల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, సామగ్రి పంపిణీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.పోలింగ్ కేంద్రాల వారీగా అవసరమైన సామగ్రి వివరాలను పరిశీలించి, ఎలాంటి కొరత లేకుండా పంపిణీ చేయాలన్నారు. రూట్ల వారీగా సామగ్రిని సిద్ధం చేసి, పంపిణీ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. వర్షాల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పోలింగ్ సిబ్బందికి సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి రెండో విడత రాండమైజేషన్ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 24న సిబ్బందికి విధుల కేటాయింపు, 26న శిక్షణ, 27న రెండో విడత రాండమైజేషన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు, తాగునీరు, విద్యుత్, ఇంటర్నెట్ సదుపాయాలు కల్పించాలని, దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, ఆర్డీవోలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ఏర్పాట్ల వివరాలను సమర్పించాలని సూచించారు. ఎన్నికల సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అన్ని పోలింగ్ కేంద్రాలకు రూట్ మ్యాప్‌లు సిద్ధం చేయాలని తెలిపారు.సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, ఎన్నికల నోడల్ అధికారులు, సామగ్రి పంపిణీ మండల ఇన్‌చార్జులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలోనే ఘటన.. దురుద్దేశం లేదు

మాజీ మంత్రి విడదల రజిని ఘటనపై

అర్బన్ సీఐ పి. రమేష్ వివరణ

చిలకలూరిపేట, రక్షణ

జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగానే మాజీ మంత్రి విడదల రజిని ఇంటి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చిలకలూరిపేట అర్బన్ సీఐ పి. రమేష్ తెలిపారు. రజిని బయటకు వెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో ఆమెను నిలువరించే క్రమంలో చోటుచేసుకున్న ఘటన అనుకోకుండా జరిగిందని, పోలీసులకు ఎలాంటి దురుద్దేశం లేదని స్పష్టం చేశారు.మహిళా ఎస్ఐ లేఖ ప్రియాంక విధులు నిర్వహిస్తున్న సమయంలో మధ్యాహ్నం సుమారు 2 గంటల ప్రాంతంలో విడదల రజిని ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించారని సీఐ వివరించారు. ఎన్నికల ప్రక్రియ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఆమెను బయటకు వెళ్లకుండా నిలువరించే క్రమంలో స్వల్ప రాపిడి చోటుచేసుకుందని, ఆ సమయంలో ఆమె కింద పడిపోయారని తెలిపారు.ఈ ఘటనను ఉద్దేశపూర్వక చర్యగా భావించరాదని సీఐ రమేష్ పేర్కొన్నారు. పోలీసు శాఖ విధి నిర్వహణలో భాగంగానే ఈ పరిణామం చోటుచేసుకుందని, ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు ఎల్లప్పుడూ గౌరవ మర్యాదలతో వ్యవహరిస్తారని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం పోలీసుల బాధ్యత అని వివరించారు.

16- 9- 26 rakshana_praja jyothi Medhak.qxd 10/23/2026 11:00 PM Page 5

నామినేషన్లకు అడ్డంకులు సృష్టిస్తే కఠిన చర్యలు

మొదటి పేజీ తరువాయి

నరసరావుపేట, రక్షణ న్యూస్

పల్నాడు జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల తెలిపారు. నామినేషన్లు దాఖలు చేయకుండా అభ్యర్థులను అడ్డుకున్నా, బెదిరింపులకు గురిచేసినా ఉపేక్షించేది లేదని, ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ జగదీశ్ అధహళ్లి స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లాలోని వివిధ నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ కృతిక శుక్ల, ఎస్పీ జగదీశ్ పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చన్నారు. నామినేషన్లు వేయకుండా ఎవరైనా అడ్డుకుంటున్నట్లు ఫిర్యాదులు అందితే వెంటనే స్పందిస్తామని, అవసరమైన సందర్భాల్లో పోలీసు రక్షణ కల్పిస్తామని తెలిపారు. నామినేషన్ల దాఖలుకు శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉన్నందున, అభ్యర్థులకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా జిల్లా యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేసిందన్నారు. అభ్యర్థులు జిల్లా కలెక్టర్ లేదా జిల్లా ఎస్పీని ఫోన్ ద్వారా సంప్రదించి రక్షణ కోరవచ్చని సూచించారు. మండల స్థాయిలోని ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులకు కూడా ఈ విషయంపై ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అవసరమైతే పోలీసు ఎస్కార్ట్‌తో అభ్యర్థులను నామినేషన్ కేంద్రాలకు తీసుకెళ్లి నామినేషన్లు దాఖలు చేసేందుకు సహకరిస్తామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో జడ్పీటీసీ స్థానాలకు 65, ఎంపీటీసీ స్థానాలకు 768 నామినేషన్లు దాఖలైనట్లు కలెక్టర్ వెల్లడించారు. గతంలో కొన్ని ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలపై సమాచారం అందడంతో పోలీసు రక్షణ కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. గురజాల, సత్తెనపల్లి నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులను పోలీసు ఎస్కార్ట్‌తో నామినేషన్ కేంద్రాలకు తీసుకువచ్చి నామినేషన్లు దాఖలు చేయించినట్లు వివరించారు. మాచర్ల నుంచి వచ్చిన అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులకు సైతం అవసరమైన రక్షణ కల్పించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, గుంపులుగా గుమిగూడి అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అన్ని మండల కేంద్రాలు, నియోజకవర్గాలు, జిల్లా కేంద్రంలో అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించడమే లక్ష్యమన్నారు. ఎస్పీ జగదీశ్ అధహళ్లి మాట్లాడుతూ నామినేషన్ల దాఖలుకు పోలీసు రక్షణ కోరిన అభ్యర్థులందరికీ తగిన భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద ముందస్తు భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశామని, అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు వేసేలా పోలీసు యంత్రాంగం నిరంతరం నిఘా ఉంచిందన్నారు. ఎవరైనా అభ్యర్థులను బెదిరించినా, నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేస్తున్నారని కలెక్టర్, ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు కూడా పోలీసులకు సహకరించి ఎన్నికల నియమావళిని పాటించాలని కోరారు.

పోటీకి విముఖత.. చివరకు నామినేషన్!

మొదటి పేజీ తరువాయి

శిలార్ । నరసరావుపేట -- రక్షణ ప్రతినిధి

రాజకీయాల్లో ఎప్పుడు ఏ మలుపు ఎదురవుతుందో ఎవరూ ఊహించలేరు. పోటీకి ఆసక్తి లేదని చెప్పిన కుటుంబం నుంచే చివరకు ఓ అభ్యర్థి ఎన్నికల బరిలోకి దిగారు. పల్నాడు జిల్లా పరిషత్ ఛైర్మన్ పీఠం కోసం సాగుతున్న రాజకీయ సమీకరణాల్లో భాగంగా ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ నాగోతు (నలబోతు) వెంకట సత్యసరోజ నకరికల్లు జడ్పీటీసీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కుటుంబ సభ్యుల విముఖతను అధిగమించి ఆమెను పోటీకి ఒప్పించడంలో కూటమి ముఖ్య నేతల ప్రయత్నాలు కీలకంగా మారినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దీంతో జడ్పీ ఛైర్మన్ రేసులో సత్యసరోజ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. పల్నాడు జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి జనరల్ మహిళకు రిజర్వు కావడంతో జిల్లా రాజకీయాల్లో కొత్త సమీకరణాలు మొదలయ్యాయి. ఈ పదవిని ఆశిస్తూ టీడీపీ సీనియర్ నాయకుడు నాగోతు సౌరయ్య, బీజేపీ నాయకుడు నలబోతు వెంకట్రావు సుమారు రెండు నెలలుగా ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. వీరిద్దరూ వియ్యంకులు కావడం, సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో రాజకీయంగా ప్రాధాన్యం కలిగి ఉండటంతో వారి కుటుంబాల వైఖరిపై ఆసక్తి నెలకొంది. రాజకీయంగా, ఆర్థికంగా బలమైన నేపథ్యం ఉన్నప్పటికీ రిజర్వేషన్ మహిళకు కేటాయించడంతో వారి కుటుంబాల నుంచి పోటీకి అభ్యర్థిని నిలబెట్టడంపై తొలుత విముఖత వ్యక్తమైనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో జడ్పీ ఛైర్మన్ పదవికి పలువురు నాయకులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. సౌరయ్య, వెంకట్రావు కుటుంబాలు పోటీలో లేవన్న సమాచారం కూటమి అధిష్ఠానం దృష్టికి వెళ్లినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దీంతో నకరికల్లు జడ్పీటీసీ స్థానానికి డాక్టర్ నాగోతు వెంకట సత్యసరోజను అభ్యర్థిగా నిలబెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఇద్దరు నేతలు సౌరయ్య, వెంకట్రావులను సంప్రదించి సత్యసరోజను పోటీకి ఒప్పించాలని కోరినట్లు తెలిసింది. అయితే తమ కుటుంబ సభ్యులు ఎన్నికల్లో పోటీ చేయడానికి మొదట ఆసక్తి చూపడం లేదని వారు వెల్లడించినట్లు సమాచారం. అయినప్పటికీ పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు ముందుకు వెళ్లాలని కూటమి నేతలు స్పష్టం చేసినట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో కుటుంబ సభ్యులు చర్చించి సత్యసరోజను పోటీకి అంగీకరించేలా ఒప్పించినట్లు తెలిసింది. శుక్రవారం ఆమె నకరికల్లు జడ్పీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. భర్త డాక్టర్ రంజిత్‌కుమార్, నాగోతు సౌరయ్య, నలబోతు వెంకట్రావుతోపాటు పట్టణ ప్రముఖ వైద్యుడు డాక్టర్ మర్రి పెద్దయ్య, ఇతర వైద్యులు, కుటుంబ సభ్యులు, మద్దతుదారులు ఆమె వెంట వచ్చారు. నామినేషన్ కార్యక్రమం సందడిగా సాగింది. నకరికల్లు జడ్పీటీసీ స్థానానికి సత్యసరోజ అభ్యర్థిత్వం ఖరారవడంతో జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎంపికపై కొత్త చర్చ మొదలైంది. జడ్పీటీసీగా ఎన్నిక కావడం, ఆ తర్వాత ఛైర్మన్ పదవికి పార్టీ మద్దతు పొందడం వేర్వేరు దశలు కావడంతో ఆమె రాజకీయ ప్రయాణం ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా మారింది. కూటమి అధిష్ఠానం తుది నిర్ణయం, జడ్పీటీసీ సభ్యుల మద్దతు, జిల్లాలోని రాజకీయ సమీకరణాలు ఈ పోటీలో కీలకం కానున్నాయి. తొలుత పోటీకి విముఖత చూపిన కుటుంబం నుంచి అభ్యర్థి బరిలోకి దిగడం.. ఇప్పుడు అదే పేరు జడ్పీ పీఠం రేసులో వినిపించడం పల్నాడు రాజకీయాల్లో ఆసక్తిని పెంచుతోంది.

నామినేషన్ల ప్రక్రియలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి

జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రత కల్పించాలని సూచించారు. శుక్రవారం చీరాల, వేటపాలెం మండలాల్లోని నామినేషన్ కేంద్రాలను ఎస్పీ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, అభ్యర్థులు, వారి వెంట వచ్చే వ్యక్తులు, వాహనాల విషయంలో నిబంధనలు పాటించాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు జెడ్పీటీసీ స్థానాలకు 37 మంది, ఎంపీటీసీ స్థానాలకు 395 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎస్పీ తెలిపారు. నిజాంపట్నం మండలానికి చెందిన ఆరుగురు అభ్యర్థులకు ప్రత్యేక పోలీసు ఎస్కార్ట్ కల్పించి, నామినేషన్లు దాఖలు చేసేందుకు సహకరించినట్లు వెల్లడించారు. అభ్యర్థులకు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. నామినేషన్లతో పాటు రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్, ఎస్‌బీ సీఐ నారాయణ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణరక్షణలో పోలీసుల సాహసం

బాపట్ల రక్షణ న్యూస్

పోలీసులంటే నేరస్థులకు భయం కలిగించడమే కాదు.. ఆపదలో ఉన్న సామాన్య ప్రజలకు అండగా నిలిచి ప్రాణాలను కాపాడటం కూడా తమ బాధ్యతేనని బాపట్ల రూరల్ పోలీసులు మరోసారి నిరూపించారు. సూర్యలంక బీచ్‌లో సముద్రపు అలలకు కొట్టుకుపోతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న తెలంగాణ యువకుడిని పోలీసులు, మెరైన్ సిబ్బంది, గజ ఈతగాళ్లు సమన్వయంతో స్పందించి కాపాడారు. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన కొలిపాక శ్రీకాంత్ (25) శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2.45 గంటల సమయంలో సూర్యలంక బీచ్‌లో సముద్ర స్నానం చేస్తుండగా అలల తాకిడికి కొట్టుకుపోయి మునిగిపోతుండగా అక్కడ విధుల్లో ఉన్న బాపట్ల రూరల్ పోలీస్ అవుట్‌పోస్ట్ సిబ్బంది, మెరైన్ పోలీసులు అప్రమత్తమయ్యారు. గజ ఈతగాళ్ల సహాయంతో యువకుడిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చి, వెంటనే ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బాపట్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలు, రూరల్ సీఐ సుబ్బారావు పర్యవేక్షణలో పోలీసులు తీర ప్రాంత భద్రతపై ప్రత్యేక దృష్టి సారించడం ఈ ఘటనలో కీలకంగా నిలిచింది. ముఖ్యంగా పర్యాటకుల రద్దీ సమయాల్లో సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ, ప్రమాదాలను ముందుగానే గుర్తించి స్పందించడం ద్వారా ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. నేర నియంత్రణతో పాటు ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడంలోనూ పోలీసులు ముందుంటారనే విషయాన్ని ఈ ఘటన చాటిచెప్పింది. యువకుడి ప్రాణాలను కాపాడిన పోలీసు సిబ్బంది, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లపై పలువురు అభినందనలు వ్యక్తం చేశారు.

16- 9- 26 rakshana_praja jyothi Medhak.qxd 10/23/2026 11:00 PM Page 6

కూటమి జోరు..